**అందం, ఆకర్షణ, సువాసన లేని గడ్డిపూలను, ఏ కులీనుడైనా మోజుపడి అందలం ఎక్కించి, ఆదరించినా, వాటికక్కడ సుస్థిరస్థానం లభించదు. ఆ అంతస్తులో వుండవలసిన గులాబీలు చేజిక్కగానే, గడ్డిపూలను విసిరి బయట పడవేయడం జరుగుతుంది. అంతస్తులు మనుషులలోనే కాదు, సృష్టిలోని అన్ని ప్రాణులకు ఉన్నాయి. మనిషి అంతస్తులకు ఆస్తులు, అందాలు యోగ్యతా పత్రాలు.**

**సి. రేణూ పద్మారావ్**

**నా** పెళ్లి అనగానే నాకేం సంతోషం అనిపించలేదు. ఆకాశహర్మ్యాలు, మధుర భావనలు అంటారే అవేమీ నాకు అనుభవంలోకి రాలేదు. అంతులేని ఆశ్చర్యం, ఒకవిధమైన నిర్లిప్తత అనుభవించాను. అంతే! "అదేమే! అలా ఉన్నావు" అంటూ మా ప్రభ నన్ను మరీ మరీ అడిగినప్పుడు ఏం చెప్పాలో తెలియక చాలాసేపు తికమకపడ్డాను. "పట్టి చలనంలేని మొద్దువు" అంది అది. నిజమే. నిజం చెప్పాలంటే నా గురించి చెప్పుకోడానికి నాకే చాలా సిగ్గుగా ఉంది. నేను పెరిగిన తీరుతెన్నులు గుర్తుకు తెచ్చుకుంటుంటే ఏవోలా ఉంది. స్వంత ఇంట్లోనే బానిసలాగా పెరిగాను నేను. ఆటపాటలు, నవ్వులు... ఊహుఁ... అవేమీ మా ఇంట్లో సాగనిచ్చేవారు కారు. తలిదండ్రుల ప్రేమ, అన్నదమ్ముల ప్రేమ కథలలో, అప్పుడప్పుడు అతి కష్టంమీద నేను చూచిన సినిమాలలో చూచి 'ఆఁ! మరీ విపరీతం, పోదూ!' అనుకునేదాన్ని. అసలు నేను పుట్టగానే అప్పటివరకూ అంతో ఇంతో తారట్లాడుతున్న లక్ష్మి శాశ్వతంగా వెళ్లిపోయిందిట. అందుకే అంతా అసహ్యించుకునేవారు నన్ను. అంతులేని దారిద్ర్యం, ఉప్పు, అప్పులు. ఏం చెయ్యాలో తోచక ఎదురుగా కనిపిస్తున్న నాపై విరుచుకుపడి కడుపు మంట చల్లార్చుకునేవారు అమ్మా, నాన్నా.

ఇన్ని బాధలతో నేను కాలేజీలో చదవడానికి కారణం మా పక్క ఇంటి జానకమ్మగారు. ఆడపిల్లలు లేని ఆవిడ నన్నెంతో ప్రేమగా చూచేవారు. అప్పటికీ నేను కాలేజీకి వెళితే బానిసలు లేక అవస్థపడతామేమో అని భయపడ్డ అమ్మా, నాన్నా నన్ను ఆవిడ సహాయం తీసుకోనీయకుండా, కాలేజీ చదవకుండా ఆపుదామని చాలా ప్రయత్నించారు కాని, అడపా దడపా సహాయాలు చేస్తూ మమ్మల్ని ఆదుకుంటున్న జానకమ్మగారు కన్నెఱ్ఱజేయడానికి, ఆవిడ జాలిపడి వాళ్ల షాపులో ఇప్పించిన నాన్నా, అన్నయ్యల ఉద్యోగాలకు భయపడి ఊరుకున్నారు.

అప్పటికీ సరిగ్గా కాలేజీకి వెళ్లే సమయంవరకు గానుగెద్దులా చాకిరీచేసి, తల వంచుకొని కాలేజికి వెళ్లి మళ్లీ తలఎత్తకుండా ఇంటికి రావడం అలవాటయింది నాకు. పాపం, లీవ్‌పెట్టి మరీ నా నడతను వారం రోజులు పరీక్షించాడు మా అన్నయ్య. కాలేజీ ఆవరణలోకి అడుగుపెట్టగానే రెక్కలు విప్పిన పక్షిలా హాయి మనేది మనస్సు. కర్మ, దాని పరిపాకం గురించి రోజూ మా ఇంట్లో చావలేక బ్రతుకు ఈడుస్తున్న మా అమ్మమ్మ, నాయనమ్మ లిద్దరూ నాకు బోధిస్తుండే వారు. అదే వంటబట్టింది నాకు బాగా. అందుకే రంగు రంగుల చీరెలు, రకరకాల నగలు, నవ్వులు, చలాకీ నడకలు చూచి నేనేమాత్రం బాధపడేదాన్ని కాదు. వాళ్ల కర్మ అది, నా కర్మ ఇది. నిజమే. కర్మ బాగుండాలి దేనికైనా. అసహాయంగా ఇన్నాళ్లూ గట్టిగా మాట్లాడడానికి, మనసారా నవ్వడానికి, గొంతులో మెదులుతున్న కూనిరాగాలు తీయడానికి కూడా స్వాతంత్ర్యంలేకుండా పెరిగిన నేను కాలేజీలో ఏ మార్పు సంపాదించుకోలేక పోయాను. గట్టిగా మాట్లాడడానికి భయం. నవ్వుతూ, తుళ్లుతున్న క్లాస్ అమ్మాయిల చూపుల్లో చూపులు కలపడం భయం. లాన్స్‌లో హాయిగా ఆటలాడుతూ, ఎగిరే స్టూడెంట్సుని బెరుగ్గా చూస్తూ, ఒదిగి ఒదిగిపోతూ . . . బిగించిన జడ . . . వెలిసిపోయిన వోణీ . . . కళ్లపై కెత్తలేని అశక్తత . . . మా క్లాస్ అమ్మాయి రాధారాణి "అమ్మమ్మ!" అందంటే ఆ పిల్ల తప్పేం లేదు.

ఎంత తప్పించుకున్నా వెంటాడి స్నేహం చేసింది ప్రభ. "నీలో ఏం ఆవేశాలు ఉండవేం? వయస్సు దొంతరలు, వలపు తొందరలు నీవేం ఫీల్ కావా?" కవిత్వ ధోరణిలో మాట్లాడడం ఆ పిల్ల కిష్టం. చటుక్కున నోరు మూశాను. అవ్వ . . . ఏం మాటలవి? మావాళ్లెవరైనా వింటే ఈ పిల్లతో మాట్లాడినందుకే నరికి పోగులు పెడతారు. జీవితంలో అన్నీ నిరాశలే ఉంటాయి. పొంగడం కుంగడం కొరకే అని చిన్నప్పటినించి నాకు బోధిస్తున్నవాళ్లు ఈ మాటలు వింటే ఏమైనా ఉందా? "దీని పెళ్లి డబ్బులేక చేయ లేదు గాని, చదివి ఊళ్లేలాలనికాదు. ఏదో ఆ జానకమ్మ దీన్నో ఒడ్డున పడేస్తుందనే ఆశ . . . ఇది ఏ కొంపలు తీసే పనులు చేయకముందే . . . ఏమో ఏం చెప్పగలం? బయటకు వెళ్లిన ఆడదాన్ని నమ్మడమే?"

రోజూ రాత్రిళ్లు బయట నులక మంచంలో సణుక్కుంటుంటాడు మా నాన్న.

"అదృష్టవంతురాలివే." అందరూ అభినందించారు నన్ను. బెరుగ్గా నవ్వాను. నిజమే. లేకపోతే అంతటి అందగాడు, స్థితిమంతుడు కేవలం జానకమ్మగారి మాటమీద కానీ కట్నంలేకుండా నన్ను చేసుకోవడమేమిటి? శోభనంరాత్రి అతను దగ్గరకు తీసుకుంటూ "నిన్నెన్నో జన్మలనుంచి ఎరిగున్నట్లుగా ఉంది" అన్నాడు. లోలోపలే గొణుక్కున్నాను, ఏ జన్మలో ఏం కర్మ? ఈ జన్మలోనే. నీవు, ఆ రావ్ బహదూర్ గారి అమ్మాయి కౌసల్య కారులో పక్క పక్కన కూర్చొని కులాసాగా రయ్యిన కాలేజీ బయటకు దూసుకు పోతూంటే గేటు పక్కన ఒదిగి నిల్చున్న గీతను' అని.

పైకిమాత్రం ఏంఅనలేదు. అతనేమేమోమాటాడుతున్నాడు. తలవంచుకు నిల్చున్నాను. ఇందాకటి దాకా అతని చెల్లెళ్లు వెక్కిరించిపోయారు. ఎందుకో ఏనాడూ లేనిది నా కేదోలా అవుతుంది. ఓరకంట అతణ్ణి చూస్తూంటే అతని పక్కన కౌసల్యరూపం ప్రత్యక్షమవుతుంది. అందం, ఐశ్వర్యం, సంస్కారం, అహంకారం కలబోసిన బంగారు బొమ్మ. తండ్రి ఎస్టేటుకీ, మరో ఇదరు పిల్లలులేని దగ్గిర బంధువుల ఎస్టేట్సుకీ వారసురాలామె. రకరకాల కార్లలో కాలేజీకి వస్తూ, రోజుకొక రకంగా అలంకరించుకుంటూ ఒక ప్రత్యేక పరిధిలో, ఉన్నతమైన స్థాయిలో నిల్చిపోయిన అందాల రాశి. కాలేజీలో ఆవిడచుట్టూ బ్యూటీ క్వీన్‌లూ, లక్షాధికారుల పిల్లలే ఉంటుంటారు.

రాత్రి పెళ్లిలో పెళ్లికొడుకును చూచి ఆశ్చర్య పోయారు మా క్లాస్‌మేట్స్. "కౌసల్య బాయ్ ఫ్రెండ్ కదూ ఇతను! వీళ్లిద్దరికీ చాలా గాఢమైన సంబంధం ఉండేది. పెళ్లిచేసుకుంటారని కూడా పుకారు. అసలేం జరిగింది, గీతా! ఇతనెట్లా నిన్ను చేసుకోడానికి ఒప్పుకున్నాడు?" ఆ తరవాత రాధారాణి "సారీ!" అంటూ నోరు మూసుకుంది.

"ఇందులో ఏదో ఉంది, గీతా! కౌసల్య లాంటి దాన్ని రిజెక్ట్ చేసి . . ." మరో స్నేహితురాలు.

నాకు తెలుసు వాళ్ల భావం. కాని నాకూ అదే అర్థం కావడం లేదు. అన్నివిధాల ఆకర్షణీయంగా ఉండి, ప్రేమించిన కౌసల్యను వదిలి, ఆవిడకు ఏ విధంగానూ తూగలేని నన్ను కట్నం కూడా లేకుండా చేసుకుంటున్నాడంటే . . . ఏమో మరి!

"వద్దనకపోయావ్. నీవూ చూసేదానివిగా రోజూ ఇతడు ఆమెకోసం కాలేజీ బయట వెయిట్ చేయడం!"

వద్దనడమా! నవ్వువచ్చింది నాకు. ఏమనుకుంటున్నారు వీళ్లు. అంత స్వాతంత్ర్యమా! పెళ్లి జరిగే అవకాశమే లేని, అయాచితంగా వచ్చిన యీ అవకాశాన్ని వద్దనడమా! అమ్మమ్మ అంటుంటుంది. "మగవాణ్ణి తప్పుపట్టి ఏ ఆడది బాగుపడిందే! ఆ మగమహారాజు బయట ఎన్ని తిరుగుళ్లు తిరిగితే మాత్రమేంగాక, ఇంట్లో తిండి, బట్ట ఇచ్చి చల్లగా చూచుకుంటే చాలదూ! ఆ కృష్ణపరమాత్మ జాంబవతినీ, సత్యభామనూ పెళ్లిచేసుకొని ఇంటికి తెచ్చినప్పుడు ఆ రుక్మిణీదేవి స్వాగతం పలికి, మంగళహారతులు ఇవ్వలేదుటే! అందుకే అంత దొడ్డ ఇల్లాలయింది. ఈ ఇంటి పక్క లక్ష్మి కదేం రోగం! ఎవతినో ఉంచుకున్నావో అంటూ మొగుడి ప్రాణాలు కొరికి తింటుంది" అంటూ నానా శాపనార్థాలు పెడుతూంటుంది. అసలు ఆ కౌసల్యకూ, ఈయనకూ ఎందుకు బంధం తెగిపోయింది?

"ఏదైనా మాట్లాడు." ఆయన అడుగుతున్నారు.

. . . . . .

"సిగ్గా . . ."

మరింత తల వంచుకున్నాను.

పెద్దగా నవ్వాడు తను. "ఊఁ. ఇలా కూర్చో" అంటూ తన పక్కన కూర్చోబెట్టుకొని ఏవో కాలేజీ కబుర్లు అడగడం మొదలెట్టారు. నేనూ చిన్న చిన్న సమాధానాలిస్తూ కూర్చున్నాను. కొంతసేపటికి నేను గమనించింది ఆయన ఎందుకో లోలోపల కుమిలిపోతున్నారని. దానిని మరిచిపోవడానికి ఎప్పుడూ ఏదో మాట్లాడుతూ, ఏదో పనిలో ఉండడానికి ప్రయత్నిస్తున్నాడు.

కొంతసేపటికి అడిగాడాయన. "ఇప్పుడు బి.ఎస్‌సి. ఫస్ట్ ఇయర్ కదూ. కంప్లీట్ చేస్తావా బి. ఎస్‌సి?"

అమృతప్రాయంగా తోచిం దా మాట నాకు.

తల ఊపాను.

ఆ మరుచటి రోజు వాళ్లింటికి వెళ్లాము. చాలా బాగుంది ఇల్లు. లక్షాధికారులు కాకపోయినా మంచి

స్థితిలోనే ఉంది సంసారం. రకరకాల చీరలు, కొత్త కొత్త నగలు తెచ్చి ఇచ్చేవా రాయన. కాలేజీ వదిలి పెట్టగానే బయట ఆయన స్కూటర్‌మీద ఎదురు చూస్తూండేవారు. నాకు తెలియకుండానే నాలో చైతన్యం కొంచెం కొంచెం చోటు చేసుకుంటూంది. నాలో వచ్చిన ఈ మార్పుకు మా క్లాస్‌మేట్స్ ఆనందించారో, అసూయపడ్డారో చెప్పడం కష్టం. "కాని ఈ చీర చాలా బాగుంది. ఇలా స్మార్ట్‌గా ఉంటే బావుంటావ్ నీవు." ఇలాంటి ప్రశంసలతో నన్ను పూసుకు తిరిగేవారు. వాళ్ల దృష్టిలో పెద్ద క్రెడిట్ కౌసల్య బాయ్‌ఫ్రెండ్‌ను ఆమెను మరిపించి నేను చేసుకోవడం. విప్పరాని చిక్కు అయిపోయిందా విషయం. ఎన్నోసార్లు కౌసల్య విషయం ఆయనను అడుగుదా మనుకున్నాను. కాని ఏదో భయం, ఆయనకి కోపం వస్తుందేమోనని అనుమానం నన్ను పిరికిదాన్నిచేశాయి.

ఆ రోజు క్లాసెస్ లేక బయట లాన్‌లో కూర్చొని ప్రభతో మాట్లాడుతూంటే నవనాగరికంగా అలంకరించుకొన్న స్టూడెంట్స్ గుంపుగా అటు పోతున్నారు. వాళ్ల మధ్యలో ఉంది కౌసల్య. ఆమె చుట్టూ ఫాష

# గడ్డిపూలు



పెరేడ్‌లో ఉన్నట్లు అందమైన ఆడపిల్లలు. ఠీవిగా, అడుగులో అడుగువేస్తూ హుందాగా ఆమె వెడుతూంది! ఒంటిమీద ఒక్క బంగారు నగ లేదు. కాని ఒళ్ళే బంగారు మలామా చేసినట్లు మెరుస్తూంది. కళ్ళు జిగేల్‌మనే అందం ఆమెది. అనుకోకుండానే అవిడలో ఏదో భావాన్ని ఆశించి వెదికాయి నా కళ్ళు. ఫ్రెండ్స్‌తో ఏదో మాట్లాడుతున్న ఆమె ఎందుకో హఠాత్తుగా తల తిప్పి నా వైపు చూచింది, ఒక్క నిమిషం. అంతే. మళ్ళీ కళ్ళు తిప్పుకొని, పక్క స్నేహితురాలి మాటలకు తల వంకిస్తూ వెళ్ళిపోయింది. కాని ఈసారి ఆమె నడకలో కొంచెం తడబాటు, ముఖంలో ఒక నీలితెర క్షణమాత్రం మెదిలి మళ్ళీ ఠీవిని పుంజుకున్నాయి. నా భ్రమ అనుకున్నాను నేను. కాని అది తప్పని ఆ సాయంత్రం జరిగిన సంఘటన విడమర్చింది నాకు. సాయంకాలం మామూలుగా బయట నాకోసం నిరీక్షిస్తున్న ఆయన నన్ను చూడగానే చిరునవ్వు నవ్వారు. నేనూ చిన్నగా నవ్వి ఆయన దగ్గరగా నడిచాను. అంతలో ఆయన ముఖం మారిపోయింది తీవ్రంగా. కందగడ్డలా ఎర్రబడ్డది. ఆయన చూపులు నాకు వెనకగా కేంద్రీకరించి ఉన్నాయి. ఎందుకో అర్థంకాక వెనుదిరిగి చూచాను నేను. నా వెనక కౌసల్య కారు వస్తూంది. కారు ఆమె నడుపుతూంది. అదోలా తీక్షణంగా మా వైపు చూస్తున్న ఆమె అంతలోనే ముఖం తిప్పుకొని విపరీతమైన వేగంతో మమ్మల్ని దూసుకుపోయింది. బస్సులను, రిక్షాలను, ఆఖరికి ట్రాఫిక్ నియమాలను కూడా లెక్కచెయ్యకుండా దూసుకుపోతున్న ఆమె కారునే చూస్తున్న నేను "కూర్చో" అన్న ఆయన గద్దింపుతో ఉలిక్కిపడి ఈ లోకానికి వచ్చాను. ఆ తరవాత రెండు రోజుల వరకు ఆయన నా దగ్గరకే కాదు, ఇంటికే రాలేదు. ఆ తరవాత హఠాత్తుగా ఊడిపడి, తమంతట తామే బోలెడన్ని కబుర్లు చెప్పి . . . అంతా నటన, తెలుస్తూనే ఉంది స్పష్టంగా . . . "ఎక్కడికి పోయావో అడగవేం" అంటూ మృదువుగా మందలించి, అంతలో బాధగా ముఖం మార్చుకొని, "అహంకారం ఉన్న ఆడది అంటే నాకు చాలా అసహ్యం, గీతా! అందుకే శాంతం, వినయం గూడుకట్టుకున్నట్లున్న నిన్ను చూచి వెంటనే ఒప్పుకున్నాను పెళ్లికి . . ." అంటూ నన్ను దగ్గరికి పొదువుకున్నారు.

నిజానికి గత రెండు రోజులుగా ఆయ నేమయ్యారో అన్న తహతహతో అల్లల్లాడిపోయాను. ఇంతవరకూ ఆయన తెచ్చి ఇచ్చిన బహుమానాలు, ఆయన చూపిన ప్రేమానురాగాలు చూచినపుడు 'నాకూ మంచిరోజులు ఉన్నాయి' అన్న ఆశ మొలకెత్తింది గాని నా కీపు డని పిస్తుంది, అదంతా నటన అని, ఆయన ఆత్మవంచన చేసుకుంటున్నారని. తమలోని అశాంతిని దూరం చేసుకోవడానికి ఆయన ఉపయోగించే ఆటబొమ్మను నేను అని ఎందుకో మరీ మరీ అనిపిస్తుంది నాకు. "ఎందు కలా కౌసల్యను చూచి మారిపోయారు?" అని గాని, "మేము ఈ రెండు రోజులు గుర్తుకురాలేదా! ఎంత కలవరపడ్డామనుకున్నారు" అని గాని అడగాలని తహతహలాడింది మనస్సు. కాని నేనీ ఇంటికి చీరె, సారెలతో దర్జాగా ఇంటి కోడలు లాగా రాలేదు. ఆయన దయాదాక్షిణ్యాలమీద అడుగుపెటిన పేదదాన్ని. ఆయన భార్యనని చెప్పుకోవడమే గొప్ప నాకు. ఈ విషయం అందరూ ఎన్నో విధాల మాటలద్వారా, చేతల ద్వారా స్పష్టం చేశారు.

ప్రేమతో దగ్గిరికి తీసుకుని తండ్రి, రిబ్బనుముక్క కొనలేని అన్న, రెండు కళ్ళతో నేను నవ్వితే చూడలేని అమ్మ. . . వీళ్లందరి ముందూ ఈయన విలవ ఎంత? నటనో, నిజమో . . . ఆయన నాపై ప్రేమ కురిపిస్తున్నారు. నిజమని నేను నమ్మలేక పోతున్నాను. ఒకవేళ అదే నిజమైతే కలకాలం ఇలా ఉండాలి అని భగవంతుణ్ణి ప్రార్థిస్తాను. నటనా? . . . ఏదో ఒక నాడు దానికి తెర పడ్డప్పుడు అనుభవించక తప్పదు. అది ఇప్పటినుంచే ఎందుకు?

ఆయనతో నా బంధం రోజురోజుకు ఎక్కువవుతూంది. చుట్టపుచూపుగా వచ్చినవాళ్ల చెల్లెలు "మరీ కొంగున కట్టేసుకున్నావేం, వదినా?" అని వెక్కిరించడం మొదలు పెట్టింది. ఆయన నాతో ఎంత ప్రేమగా ప్రవర్తించినా నా కాయనపై ఎందుకో సహజంగా ప్రేమ, నావాడన్న భావన కలగడంలేదు. ఉవ్వెత్తుగా భర్తపై భార్యకు అనురాగం పొంగుకొస్తుందని మా ప్రభ చెబుతుండే అలాంటి భావాలు నన్నేం కదిలించడం లేదు. ప్రేమగా తమ కౌగిలిలోకి పొదువుకుంటున్నప్పుడు, ఆయన పెదవులు నా చెవుల దగ్గిర అస్పష్టంగా ప్రేమగా కదులుతున్నప్పుడు, ఠీవిగా మెరిసే ఎవరివో రెండు కళ్లు తీక్షణంగా, ఆ తరవాత నిర్లక్ష్యంగా మమ్మల్ని చూస్తున్నట్లు, ఆయన కౌగిలిలో ఒకప్పుడు కదలాడిన హుందాతనం, అందం నాకూ ఆయనకీ మధ్య నిల్చినట్లు ఏదో భావన. నిలువుటద్దం ఎదురుగా నా భుజాలపై వాలి ఆయన మా ప్రతిబింబాలు చూపించి ప్రేమగా నన్ను దగ్గిరికి తీసుకుంటున్నప్పుడు, కౌసల్య అందానికి, నా సామాన్య రూపానికి ఆయన అంతరం కొలుస్తున్నారా అనిపించి చటుక్కున పక్కకు జరిగేదాన్ని. ప్రభ ఏ చలనాలు లేవంటుంది. 'మరీ పిచ్చిదాన్ని అయ్యాను' అనుకొని నవ్వుకొనేదాన్ని లోలోపల.

> **వివాహం**
>
> ఆత్మకు మృత్యువు లేదని నమ్మినట్లే వివాహం శాశ్వతమని విశ్వసించాలి.
>
> —బాల్జాక్

మొదటిసారిగా ఆయనపై నా ప్రేమ కరిగి ప్రవహించింది లేడీ డాక్టర్ సరోజినీ హాస్పిటల్‌నుంచి బయటకు వచ్చినప్పుడు. అంతులేని ఆనందం, ఉద్వేగం. నాకు పట్టిన అదృష్టం నిజమా అని నన్ను తడుముతున్న వెనకటి అనుమానాలు — ఆనందంతో వణికిపోయాను. డాక్టర్ చెప్పిన విషయం విని ఆయన ముఖం వెలిగిపోయింది. అది నటన కాదు, సచ్చినిజం. అంతగా నటించడం మానవులకు శక్యంకాదనే నా *అభిప్రాయం. ఆయన ముఖంలో అంత కాంతి రావడం* నే నింతవరకెన్నడూ చూడలేదు. ఆయన చూపులు నా చూపులతో కలవాలని ప్రయత్నిస్తున్నాయి. అది గమనించి నా చూపులు సిగ్గుతో తిప్పుకున్నాను. ఆయన్ని చూస్తూంటే గుండె ఆనందంతో నిండిపోయింది. ఇన్నాళ్ళ కాయనికీ, నాకూ అంతులేని సంతోషం కలిగే రోజులు వచ్చాయి. స్కూటర్ మీద ఆయన్ని మరింత పొదువుకుని కూర్చున్నాను. అర్థమయింది అన్నట్లు వెనక్కి తిరిగి చిలిపిగా నవ్వా రాయన. ఆ తరవాత ఆయన చూపిన ప్రేమ ఎప్పటికీ మరిచి పోలేను. నన్ను కదలనీయకుండా ఆయన అన్నీ అమర్చి పెడుతూంటే, పాప కావాలి అని కలవరిస్తుంటే, "నీకేం కావాలో చెప్పు. ఇలాంటి స్థితిలో తీరని కోర్కె లుండ కూడదట" అని నన్ను ఉక్కిరి బిక్కిరిచేస్తూంటే *చిన్నప్పటినుంచి నా జీవితంలో పెనవేసుకున్న నిరాశా* భావాలను పూర్తిగా మరిచిపోయాను. ఎంత చెప్పినా వినిపించుకోకుండా "రోజూ కాలేజీకి వెళ్లిరావడం ఇబ్బందికదూ?" అని కాలేజీ మాన్పించారు. అప్పుడే తెలిసింది కౌసల్య కాలేజీ మానేసి స్టేట్స్‌కు వెళ్లిందని, అక్కడే సెటిల్ అవుతుందని. నా జీవితం పరిపూర్ణమయింది. నా ఇల్లు, నా భర్త, నా జీవితం స్వర్గం. నా అనుమానాలు అబద్ధం. నిజమే, అందరన్నట్లు నేను చాలా అదృష్టవంతురాల్ని.

"పాపనేం చదివిద్దాం?" నవ్వుతూ అడిగా రాయన.

"పాప అని నమ్మకమేమిటి మీకు?"

"ఉహుఁ పాపే కావాలి." కొంచెంసేపు గోణిగా రాయన.

"ఆల్‌రైట్. ఎవరైతేనేం? పేరేం పెడతాం, గీతా."

ఇలా నన్ను వేధించుకునే వారు. ఆనందంతో నా అణువణువూ పులకించిపోయింది.

ఆ రోజు సాయంకాలం ఒంట్లో బావుండక పడుకున్నాను. రంగి పనులు తొందరగా ముగించుకొని నా పక్క కూర్చొని కబుర్లు చెబుతూంది. ఆయన పక్క గదిలో కూర్చొని ఏదో వ్రాసుకుంటున్నారు. కాలింగ్‌బెల్ ఎవరో నొక్కుతున్నారు. రంగి తలుపు తీసింది. "మధు ఉన్నాడా?" వచ్చినాయన అడుగుతున్నారు. ఆ గొంతు విని వారు గబగబా డ్రాయింగ్ రూమ్ లోకి వెళ్లారు. నేను పడుకున్న చోటునుంచి స్పష్టంగా కన్పిస్తున్నారిద్దరూ. ఆ వచ్చినాయన 'హలో' అంటూ విష్ చేయగానే మా వారు ఆయన కౌగిలిలోకి దూసుకుపోయారు. భుజంమీద ధైర్యం చెబుతున్నట్లు నెమ్మదిగా తడుతున్నా రాయన. ఇద్దరి కళ్ళలోను విషాదం లాంటి భావం నిండిఉంది. కొంచెం సేపటికి మావారు నన్ను పిలిచి పరిచయం చేశారు. మర్యాదకు చాలా సంతోషంగా ప్రవర్తించినా ఎందుకో శేఖర్‌కు — అనే మా వారి ఫ్రెండ్‌కు — నేను నచ్చలేదని అతని చూపులే చెబుతున్నాయి. విదేశాలన్నీ తిరిగి వచ్చాడుట. రాత్రి భోజనాలయ్యాక అతడు కబుర్లు చెబుతూంటే ముఖమంతా అదోలా పెట్టుకొని, కనుబొమల మధ్య బొమముడితో నిర్లిప్తంగా మా వారు ఊ కొడుతున్నారు.

"లోపలికి వెళ్లి త్వరగా పడుకో! పొద్దుటినుంచీ బాగా అలిసిపోయావు."

లోపలికి వెళ్లి పడుకున్నాను నేను. ఏవో అర్థంలేని అనుమానాలతో నిద్ర చాలాసేపు పట్టలేదు. ముందు గదిలో వాళ్ల మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. చిన్న కునుకుపట్టి మళ్లీ బాగా మెలకువ వచ్చింది.

"అయితే కౌసల్య స్టేట్స్‌కు వెళ్లలేదూ!" మావారు ఆశ్చర్యంగా అడుగుతున్నారు.

"లేదు." శేఖర్ గొంతు.

"మరిప్పు డెక్కడుంది?"

"నీ కా విషయం అంత అవసరమా?" శేఖర్ గొంతులో కోపం ధ్వనిస్తూంది.

"శేఖర్! ఆవిడ నా కెంత ప్రాణమో నీకన్నా బాగా తెలిసినవారు లేరు."

"షటప్." రెచ్చిపోయాడు శేఖర్.

"జరిగినవన్నీ జ్ఞాపకం చెయ్యకు, మధూ. ముందటిలా నీ మీది అభిమానంతో, స్నేహంతో నిన్ను కలుసుకోవడానికి రాలేదు నేను. అశాంతితో, రకరకాల చికాకులతో నీవు కుళ్ళి కుళ్ళిపోతూంటే చూచి సంతోషిద్దామని వచ్చాను. ఎందుకో నా కలా అనిపించింది. అఫ్‌కోర్స్, నా ఊహ తలకిందయిందనుకో. ఒకప్పుడు నిన్ను చూచి చాలా గర్వపడేవాణ్నిరా. కాని కౌసల్య నంత మోసంచేశాక, పువ్వులా పెరిగిన ఆ అమ్మాయి నంత క్షోభ పెట్టాక . . ." ఎందుకో ఆయన ఆగాడు.

"జరిగిందేమిటో తెలుసుకోకుండానే . . ."

మా వారి మాటలు మధ్యలో తుంచా డతను.

"నా కంతా తెలుసు. నాకేం నీవు వివరించవలసిన అవసరం లేదు. పెళ్ళిచేసుకుందాం అని ఆవిణ్ణి నీ ఇంటికి రమ్మన్నావు. పెద్దవాళ్లకు చెప్పకుండా పారిపోదామన్నావు. అందు కామె ఒప్పుకోలేదు. ఎలాగో అందర్నీ ఒప్పించి దర్జాగా అందరి ముందూ పెళ్ళిచేసుకుందామంది. పెద్ద పెద్ద బంగళాలలో కాలు కింద పెట్టకుండా పెరిగిన పిల్ల కాబట్టి నీ మూడు గదుల కొంపకు రానంది. అవునా? . . . అంతే! నీలో రోషం, అహంకారం అప్పుడు తల ఎత్తాయి. 'ఛట్' అన్నావు. అశాంతితో తిరిగినట్లు నటించావు. కౌసల్య మీద మోజు తీరింది కాబట్టే మూడోనాటికల్లా మరో అమ్మాయిని పెళ్ళిచేసుకున్నావు." అత నింకేమో చెప్పబోతున్నాడు. వారు అడ్డు తగిలారు.

"మరి ఆడదాని కంత గర్వమా? పెళ్ళిచేసుకొని అత్తవారింటికి రాక ఎక్కడకు పోతుంది?"

"మధూ! ... ఆవిడ కంత అహంకారం ఉందని నీ వప్పుడే తెలుసుకున్నావా! నీ వామెతో స్నేహం మొదలు పెట్టే మొదటి రోజులలోనే ఆ విషయం నేను హెచ్చరించాను నిన్ను. ఆవిడ మేనేజరునురా నేను. ఆవిడ ఎలా పెరిగిందో నాకు తెలుసురా . . . జమీందారుల ఫామిలీలో పుట్టింది. మూడు ఎస్టేట్లకు వారసురా లామె. అహం ఆవిడ రక్తంలోనే ఉంది. ఇంతెందుకు? ... ఆవిడ విసుగ్గా ముఖం చిట్లిస్తేనే వాళ్ళ అమ్మా, నాన్న దగ్గిరనించి మొత్తం ఎస్టేట్ వణుకుతుంది. తను అన్న మాటకు ఎదురుఅంటూ లోకంలో ఉంటుందని తెలియకుండా పెంచా రామెను. ఆ నాడు నేను చెబితే నీ వేమన్నావు? ప్రేమ, ప్రేమ అంటూ అఘోరించావ్! ఆమె నీకు లొంగకపోతే నీవే ఆమెకు దాసుణ్ణన్నావు. చిన్నపిల్ల కౌసల్య. ఏదో మాటా మాటా పెరిగి చిన్నతనపు ఆవేశంలో ఆమె ఏదో అందని, ఆమె ఆ తరవాత పశ్చాత్తాపపడి నీ కాళ్ళ పట్టుకోవాలని ఆశించి, అది విఫలమై, విసిగి, తొందరపడి కౌసల్య జీవితాన్ని నాశనం చేశావు! ఆ తరవాత ఆమె ఏమందో తెలుసా! 'శేఖర్, నా మేనేజర్‌గా, స్నేహితుడుగా కూడా నిన్నెంతో ఆదరించాను. కాని నీవే నా నాశనానికి కారణం అవుతావనుకోలేదు' అంది. నిన్ను ఆవిడకు పరిచయం చేసినందుకు నాకు దక్కిన మర్యాదరా అది. చిన్నతనం నించి నన్ను పెంచి, పెద్దచేసి, దిక్కులేక రాలిపోకుండా, ఇంత మనిషిగా నిలబెట్టిన వారి కుటుంబానికే చాలా అన్యాయం చేశానురా. నీతో ఆమె స్నేహాన్ని ప్రోత్సహించి . . ." అతని కంఠంలో వ్యథ, ఆవేశం స్పష్టంగా తెలుస్తున్నాయి. కుమిలి పోతున్నా డాయన.

చాలాసేపు ఎవరూ మాట్లాడలేదు.

"నీకోసం ఆవి డెంత త్యాగం చేసిందో తెలుసా, మధూ! ఇంతవరకూ డజన్ల సంబంధాలు వచ్చాయి. అందరూ నీలాంటి వాళ్లను పదిమందిని పోషించగల తాహతు గలవారే. కాని కౌసల్య పెళ్ళిచేసుకోనంది. ఉన్న ఒక్క కూతురు జీవితాన్ని చేజేతులా పాడుచేసుకోవడం చూడలేక, మందలించడానికి నోరు రాక తలిదండ్రులు ఎంత కుమిలిపోతున్నారో తెలుసా!"

"శేఖర్! నిజంగా ఆవిడ అహంకారం చూచి నేను ఆవేశపడ్డానురా! చాలా తొందరగా నిర్ణయాలు చేసుకొని ఇద్దరి జీవితాలు నాశనం చేశాను. ఆవిణ్ణి తేలిగ్గా మరిచిపోగలనని భ్రమించి మోసపోయానురా! ఆవిడ గుర్తుకు రాని క్షణం నాకు లేదంటే నీవు నమ్మవురా! ఆవిడ వచ్చి, నన్ను బ్రతిమిలాడాలని ఆశించానురా నేను. ఆవిడ రాకపోగా, కావాలని నేనామె ఎదట పడిన రెండు మూడు సందర్భాలలో కూడా ముఖం తిప్పుకొని వెళ్ళిపోతే, ఆవిడకు నేనంటే లక్ష్యంలేదని, మా ప్రేమంతా ఆవిడ మరిచిపోయిందని నేను భ్రమపడ్డానురా! ఏ విధంగానూ ఆవిడను కలుసుకోవాలని నేను చేసిన ప్రయత్నాలు సాగనివ్వలే దామె. ఒక్క నిమిషం ఆవిడ స్మృతి నన్ను వదలక, మరిచిపోవాలని చేస్తున్న యత్నాలన్నీ పాడైపోతుంటే ఎంత బాధ పడుతున్నానో నీ కర్థంకాదు, శేఖర్! . . . చేజేతులా వరంలా దొరికిన ఆ అందాన్ని, అనురాగాన్ని నేను వదులుకున్నానురా!" భారంగా ఉంది వారి గొంతు.

"ఎవరిదైతేనేం తప్పు, మధూ! అనుభవిస్తున్నది ఆవిడ. సరే, పోనీ! బాబును చూస్తావా!" అతని గొంతులో ఆవేశం లే దిప్పుడు. ఆర్ద్రత, స్నేహం ధ్వనిస్తున్నాయి.

"ఎవరి బాబు?"

"ఇంకెవరి బాబు? ... మీ బాబు. బాబు సంగతి నీ వడగకపోయినా, కౌసల్య, ఈ విషయం రహస్యంగా ఉంచమని ఎంత కట్టుదిట్టంచేసినా ఎందుకో నీ కీ విషయం చెప్పాలనిపిస్తూంది బాబు నా కెంత ప్రాణమో తెలుసా, మధూ? అతనికి తండ్రిప్రేమ తెలియకపోవడం నేను సహించలేను. మధూ! అందుకే నీ కీ విషయం చెప్పాలనే వచ్చాను. అదేం అలా చూస్తున్నావ్ . . . ఏమయింది?"

"ఎందుకు వచ్చారమ్మా! నాకు ఫోన్ చెయ్యవలసింది. నేనే వచ్చేవాణ్ణి. రండి, ఆఫీసులో కూర్చుందాం." డాక్టర్ హడావిడి పడుతున్నాడు.

"నాకు . . . బాబు . . . ఇదంతా ఏమిటి, శేఖర్!"

"నీకేం తెలియదూ!" అతను నిర్ఘాంతపోయాడు. కొన్ని క్షణాలు నిశ్శబ్దం. ఆ తరవాత శేఖర్ బలంగా ఊపిరి విడిచాడు.

"ఐతే ఈ విషయం కూడా కౌసల్య నీకు చెప్పలేదన్నమాట. ఏ పట్టుదలలకు, ఏ అహంకారానికి ఆ పిల్ల తన జీవితం పాడుచేసుకుందో నా కర్థం కావటంలేదు. ఇది కూడా నీకు తెలియనీయలేదుకాబోలు. సరే! నీవు కౌసల్యను వదిలి పెళ్ళిచేసుకునేనాటికి ఆమె నాలుగు నెలల గర్భవతి."

మావారి సంగతేమోగాని, నేనుమాత్రం బిర్ర బిగుసుకుపోయాను. అటువంటి క్లిష్టపరిస్థితులలో కూడా ఆమె అభిమానాన్ని, అహంకారాన్ని అడ్డుపెట్టుకుంది. మామూలు ఆడది బేలగా "నన్నన్యాయం చేయకండీ!" అంటూ వాలిపోవలసిన పరిస్థితులలో ఆమె చిన్న విషయాలలో పంతాలు పెంచుకొని వారిని అలక్ష్యంచేసింది.

"రెస్ట్ తీసుకో, మధూ! నేను వెళతాను." నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ శేఖర్ మాటలు విన్పించాయి.

"ఆగు . . . ఏం జరిగింది? బాబెక్కడున్నాడు?"

వారి గొంతు వణుకుతూంది.

"ఆ తరవాత ఏవో మందులు ఇప్పిద్దామని ప్రయత్నించారు. ఆమె ఎవరి మాటలూ వినిపించుకోలేదు. ఆ తరవాత కొడైకెనాల్ వెళ్ళాం. అక్కడే డెలివరీ



"వలలో పడెనే పావం ..."

చిత్రం—శ్రీమతి కె. లీల (గోపన్నపాలెం)

అయింది. ఇంట్లోనే పెంచుతానని పట్టుపట్టింది కాని, తోటివాళ్లలో జరగబోయే అవమానానికి వాళ్ల అమ్మా, నాన్నా తలలు బాదుకుంటే ఎలాగో వాళ్ల సలహా ప్రకారం నా దగ్గిర పెంచడానికి ఒప్పుకుంది. ఈ సంగతి వాళ్ల ఫామిలీకీ, నాకూ తప్ప మరెవరికీ తెలియదు. ట్రూ లవ్ రా ఆమెది, మధూ! తనకు నీవు దక్కవని తెలిసీ, తన జీవితంలో తిరిగి వెలుగు నింపుకో వచ్చుగా! ఊహూ. పెళ్ళిమాట ఎత్తితేనే మండిపడుతుంది. బాబు పోషణ చాలామటుకు తనే చూస్తుంటుంది. నీ కీ విషయం తెలుపుతానని ఒకటి రెండుసార్లు అంటే ఆవిడ ఒప్పుకోలేదు. 'అతడు నాతోగాని, నా బాబుతోగాని తిరిగి సంబంధాలు పెంచుకోవడం నా కిష్టంలేదు, శేఖర్! వద్దు' అని తెగేసి చెప్పింది. 'ఎంతగా కౌసల్యకు దూరమైనా తండ్రిగా నీ హృదయం స్పందించదా!' అనే ఈ ఫోటో తెచ్చాను. వెరీ స్మార్ట్ బాయ్. అయినా నన్ను క్షమించు, మధూ. ఇప్పుడు నీవు వివాహితుడివి. కాని ఎందుకో బాబుకు అన్నివిధాల ప్రేమ లభించాలన్న స్వార్థమే నన్నీ

పని చేయించింది. ఐ యామ్ వెరి వెరి సారీ, మధూ! ఎప్పుడైనా వీలుంటే నా దగ్గిరికి రా! రహస్యంగా బాబును చూపించే ప్రయత్నం చేస్తాను. గుడ్‌బై."

వెళుతున్న అడుగుల చప్పుడు, తలుపు లాగి మరల వెయ్యడం, కారు స్టార్ట్ అవడం — ఇన్నీ ఇంతవరకూ నేను కలగనలేదని, నిజమేనని చెప్పాయి. ఆ తరవాత ఏం చెప్పాలో నాకు తోచదు. కల కరిగిపోయింది. మరునాటి ఉదయం ఆయన ముఖం చూడనికేడా భయంవేసింది. రాత్రి కూర్చున్నచోటినించి కదలలేదాయన. చేతిలో ఫోటో. బాబుదే కాబోలు. నేను కాఫీ తీసుకొని దగ్గిరికి వెళ్ళగానే చటుక్కున లేచి గదిలోకి వెళ్ళిపోయారు. వెళ్ళేటప్పుడు చూసిన ఆ చూపు . . . నే నెవరో తెలియనట్టు . . . ఎందుకో అక్రమంగా తనను దోచుకున్నట్టు . . . ఆ రోజంతా ఏమీ తినలేదు. ఎంతగా తట్టినా తలుపు తీయలేదు. ఆ సాయంకాలం ధడాల్మని తలుపు తెరుచుకొని బయట కూర్చున్న నా వైపు చూడకుండానే బయటకు వెళ్ళిపోయారు. 'ఏం చేశానని అంత కోపం?' అని అడగాలనిపించింది. గది లోపల టేబిల్ చుట్టూ రాసి చింపివేసిన లెటర్స్.

ఆ రాత్రి ఎప్పుడు వచ్చారో తెలియదు. అంతే! అదే మొదలు. ఇంతవరకూ తీగలు సాగి, పెనవేసుకున్న మా బంధాలు తెగిపోయాయి. నేను ఏం మాట్లాడినా చిరాకు. "ఆఁ ...ఊఁ"సమాధానాలు. ఏ అర్ధరాత్రికో ఇంటికి రావడం. ఒకరితో ఒకరికి సంబంధంలేకుండా, ఒకే కప్పుకింద తలదాచుకున్న అపరిచితుల్లా ప్రవర్తించడం. ఆలనా పాలనా లేకుండా ఉంది నా పరిస్థితి. పట్టించుకునేవారే లేరు. డాక్టర్ దగ్గిరికి వెళ్ళడం, మందులు, టానిక్‌లు పుచ్చుకోవడం అన్నీ ఆగిపోయాయి. నాకు విపుక్కు మంటుంటుం దప్పుడప్పుడు. "అమ్మగారింటికి పురుడుకు పోరాదమ్మా" అంటుంది రంగి. పిచ్చి రంగి. ఏముందని పొమ్మంటావు! ఎవరు రమ్మన్నారని? పైగా అప్పటి మోజులో ఈయన అక్కడ సరిగ్గా సౌకర్యాలుండవనీ, ఇక్కడే తెలిసిన డాక్టర్ దగ్గిర ఉంటే బావుంటుందని నాన్నకు వ్రాశారు. బ్రతుకు జీవుడా అనుకొని వాళ్ళు హాయిగా ఉన్నారు. వారానికి రెండు మూడు సార్లు కిందికి వెళ్ళిరావడం, వచ్చినప్పటి నుంచీ బాబుఫోటో ఎదురుగా పెట్టుకొని కూర్చోడం... ఇదీ వారి స్థితి. నేను అనుకున్నంతా అయింది. ఆయన మంచం పట్టడానికి టైఫాయిడ్ కారణమంటాడు డాక్టర్. అది మనోవ్యథ అని, కోరికోరి ఆయన రోగాన్ని తెచ్చుకున్నారని నాకు తెలుసు. అసలు ఆయనకు తీవ్రంగా ఉందని, అందుకే హాస్పిటల్‌లో జాయిన్ అయ్యారని నాకు వాళ్ళ బిజినెస్ పార్ట్‌నర్ వచ్చి చెప్పేవరకూ తెలియదు.

బెడ్‌మీద వాలి పడుకున్న ఆయన్ని ఆదుర్దాగా పట్టిచూడబోతే నా అలికిడికి ఆశగా కనులు తెరిచిన ఆయన నన్ను చూచి చిరాకుగా ముఖం తిప్పుకున్నారు. ఊరికే దూరంగా నిల్చుని చూడడం తప్ప నేను చేయగలిగిందేం లేదు. నా నీడను కూడా ఎందుకో అనవసరంగా భరించలేకపోతున్నా రాయన. డాక్టర్లు, ఆయన మిత్రులు వన్నదోలా చూస్తుంటే ఆ చూపుల్లో హేళన నూహించుకొని గాయపడుతుంది నా మనస్సు. ఎందుకో నాలో ఏదో భావం కలుగుతుంది. ఏనాడూ లేనిది ఏదో సంచలనం నాలో బయటకు రావడానికి ప్రయత్నిస్తోంది.

ఆ రోజు తొందరగా హాస్పిటల్‌కు వచ్చాను. ఇంట్లో ఒంటరిగా ఉండడం నా కలవాటే కాని, వారి పరిస్థితి రోజు రోజుకూ నాలో ఆదుర్దా ఎక్కువ చేస్తోంది. నీరసంగా పడుకున్న ఆయన . . . మాసిన గడ్డం. . . పీక్కుపోయిన చెంపలు...ఎటో శూన్యంలోకి చూస్తున్న కళ్ళు... మరో మనిషిలా ఉన్నారు. వారి ఆరోగ్యాన్ని గురించి వారి మిత్రుడు డాక్టర్‌ను రూమ్ బయట అడుగుతున్నాడు. "ఎలా ఉంది, డాక్టర్!" వణుకుతున్న గుండెల్ని బిగపట్టుకొని అడిగాను. ఏదో చెప్పబోతున్న డాక్టర్ "నమస్తే" అంటూ ఆశ్చర్యంతో అటు తిరిగాడు. నేనూ అటు తిరిగాను. "నమస్తే!" ఎర్రబడ్డ ముఖంతో, కందిన చెక్కిళ్ళతో, నీళ్ళు ఉబ్బిగట్టుకున్న ఎర్రటి కళ్ళతో కౌసల్యాదేవి నుంచుని ఉంది మునుపటి కన్నా పచ్చగా, అందంగా, అప్సరసలా మెరిసిపోతూంది. వెనక శేఖర్. అతని చేతుల్లో బాబు.

"నో, నో. థాంక్స్" అని మాత్రం అంది కౌసల్య. అటూ ఇటూ వెదుకుతున్న ఆమె కళ్ళు హఠాత్తుగా రూమ్ లోపలికి తొంగిచూచి చేపపిల్లలా చలించాయి. ఆ మరునిమిషం ఆవిడ అక్కడ లేదు. "మధూ" అంటూ వారి గుండెలపై వాలిపోయింది. "మేడమ్‌కు కావలిసినవారు ఇక్కడ ఉన్నారు. వారిని చూడడానికి వచ్చారు." మేనేజర్ శేఖర్ సంజాయిషీ చెప్తున్నాడు తెల్లబోయి చూస్తున్న డాక్టర్‌కి. బయట నాటకం చూస్తున్న ప్రేక్షకురాలులా నిల్చున్నాను. ఆయన మొదట నమ్మలేకపోయారు అనుమానంగా. అటూ, ఇటూ కదిలిన కళ్ళు ఒక్క నిమిషం నిశ్చలంగా కౌసల్యాదేవి ముఖంమీద నిల్చి 'నిజమా!' అన్నట్టు రెపరెపలాడాయి. ఆ తరవాత "కౌసల్యా!" అంటూ గాఢంగా ఆవిణ్ణి గాఢంగా కౌగలించుకొన్నారు. ఆ పిలుపులో చేజారిన అదృష్టాన్ని, ఇక తిరిగి రాదని ఆశ వదులుకున్న అదృష్టాన్ని — అనుకోకుండా పొందిన ఆనందం ఉంది. ఉద్వేగం ఉంది. ఇన్నినాళ్ళ నిరీక్షణ ఉంది. నే నున్నానన్న జ్ఞాపకం ఇద్దరిలో ఎవరికీ లేదు. ఆ దృశ్యం చూచాక ఎందుకో ఇన్నాళ్ళ నాటకానికి తెర పడిందనిపించింది.

"నాకు తెలుసు నీవు వస్తావని. నా లెటర్ నీవు నిర్లక్ష్యంచేయలేవు, కౌసల్యా!"

"నీ లెటర్ చదివాకే తెలిసింది, మధూ, నేనెంత తప్పుచేశానో. బాబుపై నీ ప్రేమ శేఖర్ చెప్పేదాకా తెలుసుకోలేకపోయాను. నిన్ను అపార్థంచేసుకొని నన్ను నేను నాశనం చేసుకున్నాను" ఆవిడ భుజాలు ఆయన కౌగిలిలో ఎగిరి పడుతున్నాయి దుఃఖంతో.

"లేదు, కౌసల్యా నాదే తప్పు. ఏడవకు. ఏం జరిగిందిప్పుడు. అసలు నీలో అందం ఏమిటో తెలుసా, కౌసల్యా! నీ తొందరే నా! ఊరుకో." ఆమె కన్నీటిని ప్రేమగా నవ్వుతూ తుడుస్తున్నా రాయన.

బాబును శేఖర్ దగ్గిరనుంచి అందుకొని తండ్రి గుండెలకు హత్తుకుంటుంటే, వాడి చెక్కిళ్లపై ముద్దులు కురిపిస్తుంటే పొంగిపోతుంది తల్లి. యజమానురాలి సంతోషం చూచి ముఖం నిండా చిరునవ్వు నింపుకున్నాడు శేఖర్. అంతా సంతోషం. ఎక్కడ చూచినా ఆనందం.

నన్ను నేనొక్కసారి పరిశీలనగా చూచుకున్నాను. దిగులుతో, బలహీనతతో ఎండిపోయిన శరీరం, సంస్కారంలేని జుట్టు, నవ్వడం మరిచిపోయిన పెదవులు, దిగులు


వాయిదాలమీద ట్రాన్సిస్టర్



ప్రపంచ ప్రసిద్ధమైన 'నేషనల్ డీలక్స్' 3 బాండ్ల, అఖిల ప్రపంచ, పోర్టబుల్ ట్రాన్సిస్టర్ రు. 10/- ల నెలసరి వాయిదాలమీద పొందండి. ప్రతి పల్లెకు, పట్నానికి పంపవచ్చును. వ్రాయండి.

MUSIC & SOUND (A.P.W.B.-10)
Post Box 1576, Delhi-6.


ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

## ముఖ్య గమనిక

మాకు పంపే వ్యాసాలు, కథలు, చిత్రాలు వగైరాలతోపాటు తగినన్ని స్టాంపులు అంటించి, తమ అడ్రసు వ్రాసిన కవరు పంపాలి. అలాంటప్పుడే ప్రచురించలేనివాటిని వెనక్కు పంపడం జరుగుతుంది.

ఆమోదించినవాటి విషయం వారికి తెలియపరుస్తాము.

స్టాంపులతోడి కవర్లు పంపకుండా తర్వాత వాటి విషయమై ఉత్తరాలు వ్రాస్తే ప్రయోజనంలేదు.

— ఎడిటర్

నింపుకున్న గాజుకళ్ళు, ఎత్తుగా కన్పిస్తున్న కడుపుతప్ప నిండైన ఆకారం లేని అనాకారితనం. నిజమే. ఎలా భరించగలరు మధు నన్ను? వంగపండు రంగు పట్టు చీరలో, ముత్యాలనగలతో, పచ్చగా, బొద్దుగా, అందానికి ప్రతినిధిగా నిలబడ్డ కౌసల్య! తల్లి అందాలు పుణికి పుచ్చుకొని తండ్రి ఒడిలో ఖరీదైన బట్టల్లో అందంగా మెరుస్తున్న బాబు. వాళ్ళను చూచాక నాపై ఆయనకు దృష్టి ఎలా నిలుస్తుంది?

తల తిరుగుతూంది. నేనేమయ్యానో ఎవరూ పట్టించుకునే స్థితిలో లేరు. నీరసంగా గది బయట గోడ నానుకొని నిల్చున్నాను. లోపలనించి కౌసల్య గొంతు వినబడుతూంది.

"చివరికి నీకీ అవస్థ పట్టిందా, మధూ! పద. మనం వెళ్ళిపోదాం. ఇన్నాళ్ళూ నీకు దూరంగా ఉండి నే ననుభవించిన నరకం చాలు. ఇప్పుడనిపిస్తుంది ఎందుకిలా జీవితం వ్యర్థం చేసుకున్నానా అని. లేనిపోని అనుమానాలతో, వాళ్ళేమనుకుంటారో, వీళ్ళేమనుకుంటారో అని జడిసి చాలా పాడుచేసుకున్నాను. మనం ఇక ఇక్కడ ఉండద్దు. హాయిగా మనిద్దరం బాబును తీసుకొని స్టేట్స్‌కు వెళ్దాం."

"మేడమ్! మరి ఆ అమ్మాయి? . . ." శేఖర్.

"ఏ అమ్మాయి?" కౌసల్య గొంతు విసుగ్గా వినిపించింది.

"అదే! మధు పెళ్ళిచేసుకున్న అమ్మాయి. అంత తేలిగ్గా వదలిపెడుతుందంటారా?"

"శేఖర్! ఏదో ఒక ఏర్పాటు నీవే చెయ్యి. ఎలాగోలా వదిలించాలి. మధు నాకు కావాలి. అతణ్ణి మళ్ళీ మరొకరితో కలిసి పంచుకోవడం నా కిష్టంలేదు. ఏదోలాగా పట్టుదల వినిపించిందామె గొంతులో.

వారేమన్నా అంటారేమోనని ఆశ లేకపోయినా ఎదురుచూశాను. వారు మాట్లాడలేదు. కొంతసేపటికి వారి గొంతు వినిపించింది. కౌసల్య వెక్కిళ్ళతుడుస్తూ, బాబును ముద్దుపెట్టుకుంటున్నారు.

"మాట్లాడవేం, మధూ! ఎలా ఆమె సంగతి" కౌసల్య గొంతులో నేనో, ఆమెనో తేల్చుకోమన్న ధ్వని ఉంది.

అయ్యో! పిచ్చి కౌసల్యా! అంతమాత్రం నీ మధుని అర్థం చేసుకోలేవా! వద్దు, కౌసల్యా, వద్దు. నీవే ఉండు వారితో. నిన్ను వదలి నన్ను చేరదీయడమా! అది అసంభవమని తెలిసే నీ వంటున్నావు గదూ ఆ మాట. అంత కోపమెందుకన్నా నా మీద. వచ్చినప్పటినించీ నన్ను చూస్తున్న చూపుల్లో నన్నొక మనిషిగా నీవు గుర్తించడం లేదన్న నిర్లక్ష్యం కనిపిస్తూంది. నన్ను బాధ పెట్టాలని, నీ ఆధిక్యం చూపాలని గదూ ఆ చూపు! పొరబడ్డావు! అలాంటి చూపులు నా కలవాటే. నేను లేకపోతే నాగురించి విచారించే వాళ్ళెవరూ లేరు. మునిగిపోయే అస్తిత్వం లేదు. నీ కలా కాదే. నీవు లేని కుమిలిపోయే తల్లిదండ్రులున్నారు. నిన్ను ప్రేమించి బాధపడే హృదయాలున్నాయి. తరగని ఆస్తి ఉన్నాయి. అదృష్టవంతురాలిగా పుట్టావు నీవు, కౌసల్యా! దుఃఖం నీ చాయలకు రాకూడదు. నీకు తెలియదు, కౌసల్యా, నా పుట్టింట్లో పెళ్ళికాకముందు చాలచాలని కంబళ్ళ కప్పుకొని . . . సగం ఆకలితో నిద్రపట్టక మేసితే నాకు కలత నిదురలో కన్పించే కలలలో ఊహామూర్తివి నీవు. నీలా బ్రతకాలన్న కాంక్ష నాలో పుట్టి బయటకు రాడానికి సిగ్గుపడి నా లోలోపలే అణగిపోయింది. నీ అందానికి, సిరికి రావలసింది దుఃఖం కాదమ్మా. మామూలు స్త్రీలా బేలగా నీ గొంతు దుఃఖంధ్వనించడం, గులాబి రేకులు పొదిగినట్లున్న నీ చెక్కిళ్ళపై కన్నీటి బిందువులు రాలడం నేనే సహించలేను, కౌసల్యా!

ఏడవకు. నాలాంటి నిర్భాగ్యులు చాలా చాలా మంది ఉంటారు. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఎక్కడో రాలిపోతుంటారు. గడ్డిపూలకున్న విలువ మా జీవితాలది. కాని నీ దలా కాదే. అందమైన కుండీలో పాతి, పన్నీరు పోసి, అనుక్షణం వికసించాలని అందరూ తాపత్రయపడే అపురూపమైన గులాబీవి నీవు. నాకు తెలుసు, కౌసల్యా! నీలో మానవత్వం ఉంది. అందుకే నీ వలా నవ్వులు చిలకరిస్తుండాలి. నేను బ్రతిమిలాడితే నన్ను నీ దగ్గిర పనిచేసే మనిషిగా ఉంచుకోవడానికి అభ్యంతర పెట్టవు. మరో మరో పరిస్థితులలో అయితే అందుకు నాకే అభ్యంతరం ఉండేదికాదు. కాని ఎందుకో నా కావేశం వస్తూంది, కౌసల్యా! చిన్నప్పటినించి నా చాయలకు రాని ఆవేశం, ఎటువంటి పరిస్థితులలోనూ నన్నంటని ఆవేశం ఎందుకో సెగలు, పొగలు చిమ్ముకుంటూ వస్తూంది నాలో. కారణం నాలో పెరుగుతున్న పాపే కావచ్చు. తండ్రికి అక్కరలేని పాప . . . నేను తప్ప సంతోషించడానికి మరెవరూ లేని పాప . . . భూమిమీద పడకముందే కష్టాలు ఒడి నింపుకుంటున్న పాప... బహుశా నా పాపమీద జాలే నాలో ఈ మార్పు తెచ్చిందేమో! ఎవరు సంతోషించినా లేకపోయినా నా పాప నాకు గొప్ప. నాకు తెలుసు, నీ బాబుకున్న గౌరవం నా పాపకుండదు. బాబు అతని దగ్గిర లేనప్పుడే బాబు ఫోటోయే నా పాప మీద అతని కున్న మమకారాన్ని విరిచేసింది. ఇప్పుడు బాబు శాశ్వతంగా ఆయన దగ్గిర ఉంటున్న ఈ సమయంలో ఆయన మమ్మల్ని కన్నెత్తైనా చూస్తారన్నది భ్రమం. ఇక పోతే మరో ఆధారం లేదు కనక బానిసల్లా బ్రతకాలి నేను, నా పాప. ఓ నా! అలా ఉండడానికి నా కభ్యంతరం లేదు. నా జీవితంలో అలాంటి కాలం చాలా ఎక్కువ. కాని, పాప... దాన్ని నాలా పెంచడానికి నా మనస్సంగీకరించ లేదు. అందుకే నేను వెళ్ళిపోతున్నాను. చిన్నప్పటినించి అస్వతంత్రంగా పెరిగిన నేను ఎలాగోలా నా పాపను స్వతంత్రంగా పెంచుతాను. బిక్కుగా . . . దీనంగా . . . వికసించని మనస్సుతో పెరిగిన నేను ధైర్యంగా, నలుగురిలో తలఎత్తి తిరిగేలా పాపను పెంచుతాను. అందుకే వెళ్ళిపోతాను. ఎవరిమీద మమతలు, అధికారం లేని నాకు పాపద్వారా దొరుకబోతున్న ఈ అనుభవాన్ని ఈ ఇంట్లో నాశనం చేసుకోవడానికి ఒప్పుకోను. నా ఆశ పాప. దానికోసం ఏమైనా చేస్తాను. ఒకవేళ డాక్టర్ అనుమానిస్తున్నట్లు అనుకోనిదేదైనా జరిగితే ఇక మిగిలేదేం ఉండదు. కాని, పాప . . . నా గొంతుగుడు ఎవరూ వినిపించుకోలేదు. గిరుక్కున వెనుదిరిగి లక్ష్యంలేని దారినెంబడి నిర్లక్ష్యంగా అడుగులు వేసూ హాస్పిటల్ బయటకు వచ్చేశాను. ☆

ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక

ప్రకటన రేట్లు

కాజువల్: కాల సెం. మీ 1 కి రు. 7-50
కంట్రాక్టు: కాలం సెం. మీ. 1 కి రు. 6-80
250 సెం. మీ. లు, ఆపైన)
ప్రకటనకు కనీస స్థలం
(సిం. కాలం 5 సెం. మీ. లు)

అట్ట పేజీలు:

4 వ పేజీ - రెండు రంగులు

కాజువల్: ప్రకటన 1కి రు. 1,100/—
కంట్రాక్టు: ప్రకటన 1కి రు. 950/—
( కనీసం 6 ప్రకటనలు )

2 వ పేజీ, 3 వ పేజీ -
ఒక రంగు

కాజువల్: ప్రకటన 1 కి రు. 700/—
కంట్రాక్టు: ప్రకటన 1కి రు. 600/—
(కనీసం 6 ప్రకటనలు )

కొలతలు:

కాలం వెడల్పు 5 సెం. మీ.
కాలం నిడివి 23 సెం. మీ.
పేజీకి 3 కాలంలు

ఇతర వివరాలకు దిగువవారికి వ్రాయండి:

అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్,
ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు-2

1-8 66 నుండి ప్రకటనలపై వసూలు
10% సర్చార్జి విధింపబడును.